క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపంజాణి: శంకర్రాయలపేట పూలే బాలికల గురుకుల పాఠశాలలో 2023–2024వ విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో బ్యాక్ లాగ్ సీట్లలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఏ.జ్యోత్స్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం తీసుకుని పాఠశాలలో ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తులు పొందవచ్చునని తెలిపారు. దరఖాస్తులను జూన్ 15వ తేదీలోగా పాఠశాలలో అందజేయాలని ఆమె పేర్కొన్నారు. 20వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

పశు వైద్యశిబిరానికి స్పందన

సోమల: తమ్మినాయనిపల్లె పంచాయతీ చెరుకువారిపల్లెలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 105 పశువులకు పిడుదుల మందు పిచికారీ, 32 దూడలకు నట్టల నివారణ మందు, 17 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేశారు. పశువైద్యాధికారి చందనప్రియ, ఏహెచ్ఏ అనూష, సహదేవ, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

కోలాహలంగా గంగజాతర



పొంగళ్లు పెడుతున్న భక్తులు

సదుం: స్థానిక దాసరి సామాజిక వర్గం ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతి గంగమ్మ జాతర కోలాహలంగా నిర్వహించారు. తిరుపతి గంగమ్మ జాతర ముగిసిన మూడో వారం ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీ. పెద్దసంఖ్యలో మహిళలు పొంగళ్లతో ఊరేగింపుగా భట్టువారిపల్లెలోని ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా అందిస్తున్న సర్పంచ్ చెన్నరాయన్

గుడుపల్లె: అనారోగ్యంతో మృతిచెందిన మూర్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.లక్ష మంజూరైందన్నారు. మండలంలోని గుడుపల్లెకు చెందిన మూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో వైఎస్సార్ బీమా పథకం కింద మృతుడి భార్య రాధకు రూ.10 వేలను సర్పంచ్ చెన్నరాయన్, కార్యదర్శి శివశంకర్ అందజేశారు. మిగిలిన రూ.90 వేలను రాధ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని పేర్కొన్నారు.

మొక్కజొన్న విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న నాగభూషణంరెడ్డి

సోమల: పొదలగుంటపల్లె రైతు భరోసా కేంద్రంలో పశువైద్య శాఖ ద్వారా అందజేసిన జొన్న, మొక్కజొన్న విత్తనాలను వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు నాగభూషణంరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. పశుగ్రాస కొరత తీర్చేందుకు రైతులకు మొక్కజొన్న విత్తనాలు ఎంతో ఉపయోగపడతాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సర్పంచ్ జయరాం, బావాజాన్ పాల్గొన్నారు.

90శాతం పంపిణీ పూర్తి

గంగవరం: ఖరీఫ్‌లో రైతులకు వేరుశనగ విత్తనాలు 90 శాతం పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి హేమలత తెలిపారు. గంగవరంలో రైతుల విత్తనాల పంపిణీని మంగళవారం ఆమె పరిశీలించారు. మండలానికి కేటాయించిన మొత్తం 5,198 బస్తాల్లో 4,584 బస్తాలు ఇప్పటికే ఆర్బీకేల పరిధిలో టోకెన్లు పొందిన రైతులకు విత్తనాల బస్తాలను అందించినట్టు తెలిపారు. మిగిలిన శాతం నేటితో పూర్తవుతుందని పేర్కొన్నారు. మండలంలోని 2,200 హెక్టార్లలో ఏటా వేరుశనగ పండుతోందన్నారు. ఈ అదునులో విత్తనాలు పొందిన రైతులు త్వరగా విత్తు వేయడం ప్రారంభించినట్లయితే పంట చేతికొచ్చేసరికి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పంట లాభసాటిగా ఉంటుందన్నారు.

15న మార్కెట్ కమిటీ షాపుల వేలం

పుంగనూరు: పట్టణంలో గల మార్కెట్ కమిటీ సముదాయంలో నాలుగు షాపులకు ఈనెల 15న వేలం వేయనున్నట్లు కార్యదర్శి గోపి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీ స్టాల్, ఫలహారశాల, కూల్ డ్రింక్స్‌షాపులు–2 ఏడాది పాటు లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను ఆసక్తి గలవారు ఒక్కొక్క షాపునకు రూ.25 వేలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు.

పల్లె చూడని వెలుగు!

- బైపాస్ బాట పడుతున్న ఆర్డినరీ సర్వీసులు
- తీవ్ర ఇబ్బందుల్లో గ్రామీణులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బైపాస్‌లో వెళుతున్న పలమనేరు వెళ్లే బస్సు

గంగవరం: మండలంలోని పలమనేరు– మదనపల్లి జాతీయ రహదారిలోని మబ్బువారిపేట, కల్లుపల్లి గ్రామాల్లో వెళ్లాల్సిన ఆర్టీసీ ఆర్డినరీ బస్సులు బైపాస్‌లోనే ప్రయాణిస్తున్నాయి. ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు, లారీలు, భారీ వాహనాలు వెళ్లేందుకు రెండు గ్రామాలకు ఆవతలి వైపు గతంలో బైపాస్ నిర్మాణాలు జరిగాయి. అయితే గ్రామాల మధ్యలో వెళ్లాల్సిన ఆర్డినరీ బస్సులు సైతం బైపాస్‌లోనే వెళుతున్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. రోజూ అర కిలోమీటర్‌లో ఉన్న బైపాస్ రోడ్డు వరకూ నడిచి వెళ్లి మరీ బస్సులు ఆపాల్సిన పరిస్థితి నెలకొంది.

నిర్లక్ష్య ధోరణిలో సిబ్బంది..

ప్రయాణికుల సౌకర్యార్థం గ్రామాల్లోనే ఆర్టీసీ బస్సులు నడవాలని గతంలో గ్రామస్తులు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు చౌడేపల్లి, పుంగనూరు, మదనపల్లి ఆర్డినరీ బస్సులు గ్రామాల మధ్యనే రాకపోకలు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ బైపాస్‌లో వెళ్లినట్లయితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. సిబ్బంది మాత్రం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తూ అధికారుల ఆదేశాలు భేఖాతరు చేసి బైపాస్‌లోనే వెళుతున్నారు. ఆర్టీసీలో వచ్చే ప్రయాణికులు గ్రామాల్లో దిగాల్సి ఉండగా బైపాస్‌లోనే దింపేస్తున్నారు. దీంతో బస్సులు గ్రామాల్లో వెళ్లకుండా బైపాస్‌లో వెళ్లడం ఏమిటని ప్రశ్నించిన ప్రయాణికులపై సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మార్పు లేదు..

గ్రామాల మీదుగానే ఆర్డినరీ బస్సులు రాకపోకలు చేయాలని గ్రామస్తులు అనేకసార్లు సంబంధిత గ్రామ సచివాలయాల్లో అర్జీలు పెట్టుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గతంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కల్లుపల్లి గ్రామ నివాసి మండల వైస్ ఎంపీపీ ఉమాదేవి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేగౌడకు బస్సుల రాకపోకలపై విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రయాణికుల సౌకర్యార్థం గ్రామాల్లోనే ఆర్డినరీ బస్సులు నడపాలంటూ డిపో మేనేజర్‌కి లిఖితపూర్వకంగా ఆదేశాలు పంపారు. అయినా సిబ్బందిలో ఏ మాత్రం మార్పు రాలేదు. ఉన్నతాధికారులు కల్పించుకుని నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుని గ్రామాల్లో బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు..



గ్రామంలోకి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక ప్రజాప్రతినిధిగా ప్రయాణికుల బాధలు గుర్తించి అనేకసార్లు డిపో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా బైపాస్‌లోనే బస్సులు నడుపుతున్నారు. ఇప్పటికీ రోజుకు ఒకటి, రెండు బస్సులు తప్ప మిగిలిన బస్సులన్నీ బైపాస్‌లోనే వెళ్తున్నాయి

– ఉమాదేవి, గంగవరం వైస్ ఎంపీపీ

బైపాస్‌లో వెళ్లే సిబ్బందిపై చర్యలు తప్పవు

పలమనేరు డిపో నుంచి మదనపల్లి, చౌడేపల్లి వెళ్లే ప్రతి ఆర్డినరీ బస్సు గ్రామాల్లో వెళ్లాలంటూ డ్రైవర్లకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చాం. దీనికి సంబంధించి బస్టాండ్‌లో నోటీస్ బోర్డు కూడా ఏర్పాటు చేశాం. అయినా బస్సులు బైపాస్‌లోనే వెళ్తున్నాయంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. ఇకపై ఆర్డినరీ బస్సులు బైపాస్‌లో వెళ్తే కేసులు కట్టడం గ్యారంటీ. గ్రామంలోకి ఒక్క బస్సు రాకపోయినా వెంటనే మాకు సమాచారం ఇవ్వండి.

– దినేష్, అసిస్టెంట్ డిపో మేనేజర్, పలమనేరు

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు



సమస్యలను వింటున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: అర్హతే ప్రామాణికంగా జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మంగళవారం మండలంలోని కొంగాటం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కనమనాయనపల్లి, చింతల ఎల్లాగరం, గంగాపురం, పిచ్చిగుండ్లపల్లి, జీడిగుట్ల గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎమ్మెల్యేకు మహిళలు కర్పూరహారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసమే ప్రభుత్వం నవరత్నాలు అమలు చేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివద్ధే ధ్యేయంగా జగనన్న వారిపేరుపైనే వైఎస్సార్ చేయూత, ఇంటి పట్టాలు, వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, పథకాలను అందజేస్తూ మహిళల ఖాతాల్లోనే నగదు జమచేస్తున్నట్లు తెలిపారు. జగనన్న పథకాలను చూసి ఆకర్షితులై పక్క రాష్ట్రాలు కూడా అమలు పరుస్తున్నట్లు తెలిపారు. దేశానికే ఆదర్శవంతమైన పాలన కొనసాగించడం జగనన్నకే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే ప్రజలను అభ్యర్థించారు. ఎంపీపీ యువరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, సర్పంచ్ అనితారెడ్డి, పార్టీ సంయుక్త కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ కమల్, మాజీ ఏఎంసీ చైర్మన్ ప్రహ్లాద, ఏఎంసీ వైస్ చైర్మన్ అంజనేయులు, సింగల్‌విండో చైర్మన్ శ్రీరాములురెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు



లక్కనపల్లెలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: అభివృద్ధి, సంక్షేమానికి వలంటీర్లే వారధులని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప పేర్కొన్నారు. లక్కనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం లక్కనపల్లె, గొల్లచీమనపల్లె, ఆల్లపల్లె, కంభంపల్లె, పెద్దచల్లారగుంట సచివాలయ పరిధిల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం వలంటీర్ల వ్యవస్థ వైపు చూస్తున్నాయన్నారు. అనంతరం వలంటీర్లకు సత్కారం చేశారు. ఎంపీపీ సొంత నిధులతో వలంటీర్లకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచులు ఝాన్సీలక్ష్మి, క్రిష్టారెడ్డి, నారాయణరెడ్డి, రమణారెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి కృషి..

అన్నదాతల సంక్షేమానికి ముఖ్యమంత్రి విశేష కృషిచేస్తున్నారని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప కొనియాడారు. మండలంలోని గొల్లచీమనపల్లెలో మంగళవారం రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాల బస్తాలను పంపిణీ చేశారు. సర్పంచులు ఝాన్సీలక్ష్మి, నారాయణరెడ్డి, నేతలు రెడ్డెప్పగౌడ్, నాగభూషణంరెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.

మండల కార్యాలయం ప్రారంభం రేపు

పుంగనూరు: మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా నూతన మండల పరిషత్ కార్యాలయాన్ని ఈనెల 8న ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.2.60 కోట్లతో నిర్మించిన మండల కార్యాలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా మాట్లాడుతూ పట్టణంలోని రాగానిపల్లె రోడ్డు, ఈస్ట్‌పేటలో నిర్మించిన రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.80 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు శాంతినగర్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ హైఓల్టేజ్ లేన్ల మార్పు కార్యక్రమం పనులను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. లేన్ల మార్పునకు రూ.86 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మంత్రి పర్యటనను జయప్రదం చేయాలని వారు కోరారు.

ఇంటింటికీ మినరల్ వాటర్



పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని 19వార్డు ప్రజలకు కౌన్సిలర్ శ్రీలక్ష్మి కొన్ని నెలలుగా ఇంటింటికీ పూటకు రెండు క్యాన్ల అపోలో మినరల్ వాటర్‌ను అందిస్తున్నారు. మున్సిపాలిటీలో నీటి సమస్య లేనప్పటికీ సంబంధిత ప్రాంతం ఎత్తుగా ఉండడంతో రోజు మార్చి రోజు నీరందుతోంది. అయితే పేదలు ఎక్కువగా ఉండే ఈ వార్డులో ఇంటింటికీ మినరల్ వాటర్‌ను ఇవ్వాలనే ఉద్దేశంతో సంబంధిత వార్డు కౌన్సిలర్ తన సొంతనిధులతో మినరల్ వాటర్‌ను పంపిణీ చేస్తున్నారు. దీంతో ఆ వార్డు ప్రజలు కౌన్సిలర్, ఎమ్మెల్యే వెంకటేగౌడ, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలిపారు.

ఆక్రమణలను తొలగించండి



పలమనేరు: పట్టణంలోని గంగమ్మగుడి వీధిలో ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కిరణ్, కౌన్సిలర్ నాగరాజు మంగళవారం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు విన్నవించారు. దీనిపై కౌన్సిల్‌లో చర్చించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

సమన్వయంతో లక్ష్యాలు సాధించాలి

చిత్తూరు అర్బన్: వార్డు కార్యదర్శులు, సూపర్‌వైజర్లు సమన్వయంతో హౌసింగ్ లక్ష్యాలను అధిగమించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో జగనన్న హౌసింగ్ కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణాల పురోగతిపై మంగళవారం సాయంత్రం కమిషనర్ డాక్టర్ జె.అరుణ, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఆర్డీఓ రేణుకతో కలిసి వార్డు కార్యదర్శులు, సూపర్‌వైజర్ అధికారులతో జేసీ సమీక్షించారు. జూలై 31 నాటికి నిర్దేశించిన ఇళ్లను పూర్తిచేసేలా వార్డు కార్యదర్శులు పరస్పర సహకారంతో లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలన్నారు.

విస్తృతంగా కలెక్టర్ పర్యటన



మిల్లెట్ మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

గుడుపల్లె: మండలంలో విస్తృత స్థాయిలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం పర్యటించారు. మండలంలోని బెగ్గిలిపల్లె వైఎస్సార్ లేఔట్‌లో నిర్మించిన జగనన్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం శెట్టిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుకలపై విద్యార్థులను విచారించారు. అనంతరం గుడుపల్లె సచివాలయాన్ని సందర్శించి వలంటీర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. సచివాలయ, రైతు భరోసా కేంద్రాల భవనాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. కాడేపల్లెలోని మిల్లెట్ మిల్లులను పరిశీలించి వాటి నుంచి వచ్చే ఆదాయాలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీడీఓ రమణ, ఈఓపీఆర్డీ శంకర్, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెటర్నరీ కళాశాల స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, నేతలు

సదుం: ఎర్రాతివారిపల్లె మార్గంలో కొత్తగా నిర్మించనున్న వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలకు ఎంపిక చేసిన స్థలాన్ని సోషల్ వెల్ఫేర్ ఈఈ శివప్రసాద్ మంగళవారం పరిశీలించారు. భవన నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్టు ఆయన చెప్పారు. డీఈ జయకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, కాలేజీ ప్రిన్సిపల్ యషిత, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటుదాం



మాట్లాడుతున్న డా.అనౌహి

పలమనేరు: మానవాళి భవిష్యత్తు కోసం నేటి సమాజం తప్పకుండా మొక్కలను విరివిగా నాటాల్సిన అవసరం ఉందని మండల వైద్యాధికారి డా.అనౌఖి సూచించారు. కొలమాసనపల్లి పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆమె మొక్కలను నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది జయశంకర్, వందన, సుశీల్‌కుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇదో కొత్త పలమనేరు టౌన్!



బొమ్మిదొడ్డి జగనన్న లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాలు

- బొమ్మిదొడ్డి లేఔట్‌లో 2,820 స్థలాలు
- ఇప్పటిదాకా 2,236 మందికి ఇళ్లు మంజూరు
- విద్యుత్, మంచినీరు, సింథటిక్ ట్యాంకులతో సదుపాయాలు
- నియోజకవర్గంలోనే అతిపెద్ద లేఔట్

పలమనేరు: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న జగనన్న ఇళ్ల కార్యక్రమం కొత్త ఊర్లను నిర్మిస్తోంది. జిల్లాలోని పలమనేరు పట్టణ సమీపంలోని నిర్మిస్తున్న బొమ్మిదొడ్డి జగనన్న లేఔట్ ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా చెప్పుకోవచ్చు. పలమనేరు మున్సిపాలిటీ జనాభా 60వేలదాకా ఉంది. ఇక్కడ మొత్తం ఇళ్లు 14వేల దాకా ఉన్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం పలమనేరు మున్సిపాలిటీలో బొమ్మిదొడ్డి జగనన్న లేఔట్‌లో 2,820 ఇంటి స్థలాలను కేటాయించారు. ఇదే కాలనీలో మరో వెయ్యి ఇళ్ల నిర్మాణానికి స్థలం ఉంది. అంటే పలమనేరు పట్టణంలాగే ఇక్కడ మరో కొత్త పలమనేరు తయారైనట్టే. ఇది కేవలం బొమ్మిదొడ్డి లేఔట్ మాత్రమే. ఇక మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మిదొడ్డి, గంటావూరులలో మరో మూడువేల ఇళ్ల నిర్మాణం సాగుతోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 5,820 ఇళ్లను కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. గత టీడీపీ పాలనలో మున్సిపాలిటీలో పట్టుమని పది ఇళ్లు కట్టించలేదని ఈ ప్రభుత్వం పేదవాని సొంతింటి కలను నిజం చేశారని పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు వెంచర్లను తలపిస్తున్న లేఔట్

ప్రైవేటు వెంచర్లను తలదన్నేలా బొమ్మిదొడ్డి జగనన్న కాలనీ లేఔట్ తయారైంది. మంచి వాతావరణం, పక్కా వాస్తు కలిగిన స్థలంలో కాలనీ ఏర్పాటైంది. లేఔట్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా 30 అడుగులతో రోడ్లకు స్థలాన్ని కేటాయించారు. కాలనీలో పూర్తిస్థాయిలో ట్రాన్స్‌కో విద్యుద్దీకరణ చేపడుతోంది. మున్సిపల్ అధికారులు తాగునీటి కోసం కొత్తగా బోర్లను డ్రిల్ చేసి వాటికి మోటార్లను అమర్చి మంచినీటి ట్యాంకులను సైతం ఏర్పాటు చేశారు. ఇంటి నిర్మాణాలు పూర్తయిన వెంటనే వీధుల అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.



బీబీజాన్ ఇల్లు

బొమ్మిదొడ్డి లేఔట్ వివరాలు...	
బొమ్మిదొడ్డి లేఔట్ విస్తీర్ణం	:75 ఎకరాలు
ఇక్కడి మొత్తం స్థలాలు	: 2,820
మంజూరైన ఇంటి పట్టాలు	: 2,236
పూర్తయిన ఇళ్లు	: 641
బీబీఎల్(బిలో బేస్‌మెంట్ లెవల్)	:148
బేస్‌మెంట్ లెవల్	: 978
ఆర్‌సీ(రూఫ్ లెవల్)	:45
వెచ్చించిన ఖర్చు	: రూ.20.71 కోట్లు



వీధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

39 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఇబ్బందులు పడ్డాం..

పట్టణంలోని ఎంసీఆర్ నగర్‌లో 30 ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో కాపురం ఉన్నాం. ఈ ప్రభుత్వంలో మాకు ఇల్లు, స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి సకాలంలో బిల్లులందాయి. దీంతో ఇంటిని నిర్మించుకున్నాం. మాకు సొంతింటి కల జగనన్నతో నిజమైంది. నేను ఎన్నటికీ జగనన్నను మరిచిపోను.

– బీబీజాన్, గడ్డూరు లేఔట్, పలమనేరు

ఇది కొత్త పలమనేరే..



బొమ్మిదొడ్డి జగనన్న లేఔట్ నియోజకవర్గంలోనే పెద్దది. దీన్ని కొత్త పలమనేరుగా చెప్పుకోవచ్చు. ఇంత పెద్ద ప్రాజెక్టు అయినప్పటికీ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే మౌలిక సదుపాయాల కల్పన సాగుతోంది. భవిష్యత్తులో లేఔట్ చూడండి. అప్పుడు తెలుస్తుంది. ఇంత బాగుందా అని అనుకోవాల్సిందే.

– రమేష్‌రెడ్డి, డీఈ, హౌసింగ్, పలమనేరు

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



కాలేష్

శాంతిపురం: మండల ఇన్‌చార్జ్ తహసీల్దారుగా కాలేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న లోకేశ్వరరావు పెద్దపంజాణికి బదిలీ కావడంతో డీటీ కాలేష్‌ను ఆయన స్థానంలో ఉన్నత అధికారులు నియమించారు. దీంతో ఆయన మంగళవారం అదనపు బాధ్యతలను స్వీకరించారు.

ఘనంగా రథోత్సవం



కుప్పంరూరల్: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో మే 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం ఘనంగా సాగింది. ఉదయం స్వామి వారు రథంపై గ్రామ వీధుల్లో విహరించారు. ఇళ్ల వద్దకు రథం రాగానే భక్తులు పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.